
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఖమ్మం

5

సోమవారం, 11 ఆగస్టు 2025

సింగరేణి క్వార్టర్స్‌లో

## దొంగల హల్‌చల్

7

సీసీ కెమెరాలో రికార్డయిన ముగ్గురు నిందితులు

బీటీపీఎస్ నిర్మాణంలో

## ఆదివాసీలకు అన్యాయం

- 378 మంది బినామీలకు పరిహారాలు
- సీఎం రేవంత్ ఆదివాసీలను ఆదుకోవాలి
- ఆదివాసీ జాతీయ గిరిజన అభ్యుదయ సంఘం చైర్మన్ చందా లింగయ్య దొర

7

## నాగులవంచ రైల్వేస్టేషన్ మూసివేత!



మూసివేయనున్న నాగులవంచ రైల్వే స్టేషన్

చింతకాని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 77 ఏళ్లుగా ఎంతో మంది ప్రయాణికులకు రవాణా సేవలందించిన నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్యాసింజర్లకు రవాణా సేవలు, టికెట్ల పంపిణీని శాశ్వతంగా మూసివేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బి.సునీత సర్క్యులర్ (నెంబరు 117/2025) జారీ చేశారు. సుమారు 15 గ్రామాల ప్రజలకు రవాణాకు ఉపయోగపడిన రైల్వే స్టేషన్‌ను మూసివేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. నాగులవంచ రైల్వేస్టేషన్ అభివృద్ధి కొరకు పాతర్లపాడు గ్రామస్థులు అప్పటి ఎంపీ నామా నాగేశ్వరరావుకు పలు మార్లు వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయకుండా శాశ్వతంగా మూసివేస్తుండటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సేవలు కొనసాగించాలని కోరుతూ త్వరలో రైల్వే ఉన్నతాధికారులను కలుస్తామని చింతకాని టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు తెలిపారు.



ఖమ్మంలో ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా బోనాలు

- పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తుల తాకిడి
- ఖమ్మంలో మొక్కులు చెల్లించుకున్న మహిళలు

వివరాలు : 6లో



జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

## జవహర్ ఎత్తిపోతల పథకం

# భావోద్వేగ అనుబంధం

- అన్నదాతల దశాబ్దాల కల నెరవేరిన రోజు
- రాజకీయ జీవితంలో సువర్ణాధ్యాయంగా నిలిచిందన్న డిప్యూటీ సీఎం
- నలుగురు సహచర మంత్రులతో కలిసి శంకుస్థాపన చేసిన భట్టి
- ఏడాది కాలంలో పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి ఉత్తమ్
- బనకచర్లను అడ్డుకొని తీరుతాం : మంత్రి ఉత్తమ్, డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం/ మధిర/ బోనకల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కొన్ని దశాబ్దాలుగా మూడో జోన్‌లో ఉన్న సాగర్ లెఫ్ట్ కెనాల్ ఆయకట్టును రెండో జోన్‌కు మార్చాలని, సుదీర్ఘ ప్రయాణంలో మాకు నీళ్లు రావడంలేదంటూ ఇక్కడ పనిచేసిన ప్రతీ శాసన సభ్యుడిని ప్రజలు కోరుకుంటూ వచ్చారని, జవహర్ ఎత్తిపోతల పథకం ఓ భావోద్వేగ అనుబంధం' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గమైన వంగవీడు వద్ద రూ. 630 కోట్ల వ్యయంతో 33 వేల ఎకరాలకు నీరందించే జవహర్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరిలతో కలిసి భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత రైతులుగా, ఇక్కడ పారుతున్న నీళ్లు నేరుగా పొందకుండా ఆంధ్ర నుంచి మిగులు నీటిని వాడుకోవాల్సి వస్తుందన్నారు. దానిని మార్చాలని దశాబ్దాలుగా రైతులు తనను కోరుతూ వచ్చారన్నారు. మధిర నియోజకవర్గ ప్రజల అదృష్టం మేరకు నియోజకవర్గంలోని ప్రతీ మండలానికి మధ్య ఓ ఏరు ప్రవహిస్తూ వస్తుందని, వాటిని దారిమళ్లించడం ద్వారా ప్రాజెక్టుకు పునరుజ్జీవం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్ర విభజన కంటే ముందే ఆనాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సమయంలో మూడో జోన్‌లో ఉన్న మధిర, ఎర్రుపాలెం వంటి మండలాలకు సంబంధించిన నీటిని రెండో జోన్‌లోకి పారించుకోవాలని కోరగా.. ఆయన శాంక్షన్ చేయడం, సర్వే నిర్వహించడం అన్నీ చకచకా జరిగాయన్నారు. తీరా శాంక్షన్ సమయానికి రాష్ట్ర విభజన పోరాటాల సమయంలో ఫైలు పక్కన పడిపోయిందన్నారు. ఆ తర్వాత పదేళ్ల టీఆర్ఎస్ నాయకత్వంలో ధనిక రాష్ట్రంగా ఉన్న కూడా, నీళ్ల కోసం తెచ్చుకున్న రాష్ట్రం అయినప్పటికీ.. ఒక్క చుక్క నీటిని ప్రాజెక్టుల ద్వారా పంటలకు మళ్లించే కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. పైగా ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులను కట్టకుండా అలాగే వదిలి పెట్టడంతో ఈరోజు రాష్ట్రంలో రైతాంగం పెద్ద ఎత్తున ఇబ్బంది పడుతున్న సంగతి ప్రజలకు తెలిసిందేనన్నారు. మధిర నియోజకవర్గంలో ఎలాంటి పరిశ్రమలు లేవని, కేవలం వ్యవసాయం పైనే ఆధారపడి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. రైతుల చిరకాల వాంఛను నెరవేర్చేందుకు జవహర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రవేశపెట్టి శంకుస్థాపన చేయడం తన రాజకీయ జీవితంలో మరిచిపోలేని రోజుగా భట్టి అభివర్ణించారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజల రుణం తీర్చుకుంటున్నందుకు ఎంతగానో సంతృప్తిగా ఉందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆపాలని ఏపీ ముఖ్యమంత్రిని కోరామన్నారు. ఆ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా శ్రీశైలం నుంచి రోజుకు 11 టీఎంసీలను తరలించనుందని, దీంతో 25 రోజుల్లో శ్రీశైలం ఖాళీ అవుతుందన్నారు. దీనివల్ల నాగార్జునసాగర్ ఆయకట్టు మొత్తం ప్రశ్నార్థకంగా మారడంతో పాటు నల్గొండ, ఖమ్మం జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన అనంతరం కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత అమాయకులైన గిరిజనులకు సంబంధించిన 2 లక్షల ఎకరాలకు ఆర్డినెన్స్ ఇచ్చి పోలవరం కట్టుకోవడానికి ధారాదత్తం చేశారన్నారు. తెలంగాణ ప్రాంతంలోని గిరిజనులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా.. తెలంగాణ భూములను తెలంగాణకు అప్పజెప్పడంతో పాటు రెండు లక్షల ఎకరాలు ముంపునకు గురి కాకుండా పోలవరం ఎత్తు తగ్గించాలని భట్టి డిమాండ్ చేశారు. బనకచర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకునేది లేదన్నారు. మొత్తంగా తెలంగాణలోని అన్ని ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత రావాల్సిన జలాలు, వాటా పూర్తయిన తర్వాతనే మిగతా రాష్ట్రాలతో వాటాలు పంచుకునే కార్యక్రమం చేసే విధంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యావత్తు కేబినేట్ పని చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షాన, ప్రజల కోసమే పని చేస్తోందన్నారు.

### జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ గేమ్ ఛేంజర్ : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మధిర నియోజకవర్గానికి జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ గేమ్ చేంజర్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జవహర్ ఎత్తిపోతల పథకానికి మొత్తం రూ. 630 కోట్లు మంజూరై టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. ప్రాజెక్టును ఒక సంవత్సరంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ద్వారా 33వేల ఎకరాలకు నీళ్ల స్థిరీకరణ జరుగుతందన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నీళ్లు ఇచ్చే ప్రాజెక్టుల్లో జవహర్ కూడా ఒకటన్నారు. అత్యంత కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండాను భట్టి నిలబెట్టారని, కేసీఆర్‌ను సభలో గడగడలాడించారన్నారు. ఉమ్మడి ఖమ్మం కార్యకర్తలకు చేతులెత్తి దండం పెడుతున్నానని.. వారి శ్రమ, కృషి, రక్తం, చెమట కారణంగానే ఇవాళ (మిగతా 6వ పేజీలో)



బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



# డీలర్ల డీలా!

- కమీషన్ రాక ఐదు నెలలు
- ఆర్థిక ఇబ్బందుల్లో రేషన్ డీలర్లు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డీలర్లు కమీషన్ రాక డీలా పడుతున్నారు. గత ఐదు నెలల నుంచి డీలర్లకు రావాల్సిన కమీషన్ విడుదల కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలలతో పాటు మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ చేయడం వల్ల ఐదు నెలల నుంచి వారికి కమీషన్ విడుదల కాలేదు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి కమీషన్‌ను ముందుగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి.. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి బిల్లులు పెట్టుకునేది. గత ఐదు నెలల నుంచి ఈ విధానంలో మార్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ వేరుగా.. కేంద్ర ప్రభుత్వం కమీషన్ వేరుగా ఇవ్వడం వల్ల రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఫలితంగా తాము ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మూడు నెలల బియ్యం ఒకేసారితో..

గత నెలలో ప్రభుత్వం వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసింది. దీనివల్ల డీలర్లు బియ్యాన్ని భద్రపరిచేందుకు అదనపు గదులను అద్దెకు తీసుకోవాల్సి వచ్చింది. ఇక కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేసేటప్పుడు కూడా అదనంగా (మిగతా 6వ పేజీలో)

## పాలకపక్షం చేయదు.. ప్రతిపక్షం అడగదు!

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరో ఉద్యమం
- దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సభలో మందకృష్ణ మాదిగ
- దేశంలోనే అసమర్థ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అని ఆగ్రహం

6



ఇల్లెందులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

వ్యక్తిగత పరిశుభ్రత

## తప్పనిసరి

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి
- నులి పురుగులను నివారిస్తేనే ఆరోగ్యం
- నేడు ఉమ్మడి జిల్లాలో మాత్రల పంపిణీ



6

# ఇసుకాసురులు!

- సత్తుపల్లిలో మళ్లీ మొదటికొచ్చిన ఇసుక అక్రమ రవాణా
- ఆంధ్రా నుంచి భారీగా ఇసుక తరలింపు
- పట్టుబడుతున్నా.. లెక్క చేయని అక్రమార్కులు
- కఠిన చర్యలు తీసుకోని అధికారులు

సత్తుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లిలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. గత నెల వరకు భారీ స్థాయిలో కొనసాగిన ఇసుక అక్రమ రవాణా.. కొద్ది రోజులుగా నెమ్మదించినా, తిరిగి మళ్లీ జోరందుకుంది. ప్రతీరోజు పదుల సంఖ్యలో ఇసుక లారీలు సత్తుపల్లి నియోజకవర్గంలోకి చొచ్చుకొస్తున్నాయి. కొందరు అధికారులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేసినా.. పూర్తి స్థాయిలో అడ్డుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### గతంలో ఎన్నడూ లేని విధంగా..

గతంలో ఎన్నడూ లేని రీతిలో పలువురు అక్రమార్కులు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కొవ్వూరు సమీపంలో నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి ఇసుకను అక్రమంగా తరలిస్తూ పెద్ద మొత్తంలో వ్యాపారం కొనసాగిస్తున్నారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన కొందరు, సత్తుపల్లి మండలం బేతుపల్లి, రేజర్లతో పాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు జిల్లాలకు చెందిన ఇసుకాసురులు పెద్ద సంఖ్యలో లారీల్లో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ వ్యాపారులకు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి అక్రమంగా ఇసుక దందా కొనసాగుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ఇసుకతో పట్టుబడిన ఆంధ్రా లారీ

### పట్టుబడుతున్నా.. లెక్క చేయట్లే..!

అక్రమ ఇసుక లారీలను అధికారులు ఇటీవల కాలంలో పట్టుకుంటున్నా.. కొందరు ఇసుక వ్యాపారులు కనీసం లెక్క కూడా (మిగతా 6వ పేజీలో)


మనీషా

# గిరిజన మ్యూజియం చిత్రం అదుర్స్

### గీసిన ఐటీడీఏ పీవో సతీమణి మనీషా రాహుల్

భద్రాచలం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో గల గిరిజన మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఐటీడీఏ పీవో రాహుల్ ప్రత్యేక చొరవతో ఈ మ్యూజియానికి సరికొత్త హంగులు సమకూర్చారు. పీవో చొరవతో భౌతికంగా అభివృద్ధి చేసిన మ్యూజియాన్ని ఆయన సతీమణి మనీషా రాహుల్ అపురూప చిత్రంగా మలిచారు. ప్రజాదారణ పొందుతున్న గిరిజన మ్యూజియంను చిత్ర రూపంలో పెయింటింగ్ వేసారు. సహజ తత్వాన్ని సిద్ధించే విధంగా ఈ చిత్రం రూపుదిద్దుకోవడం తన పెయింటింగ్ కళావైభవానికి ప్రత్యేకంగా నిలించింది. ఆమె వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కవితలు, కథలు, శీర్షికలు రాయడం, చదవడం అంటే ఎంతో ఇష్టం. పెయింటింగ్ వేయడంలో కూడా సిద్ధ హస్తురాలు. అంతేకాక చదువుకునే చిన్నారులు అంటే ఎంతో ఇష్టం. పట్టణంలోని చెవిటి, మూగ పాఠశాలలో చదివే చిన్నారులను తరచూ కలుస్తూ వారితో పాటు కొంత సమయాన్ని గడుపుతూ ఉంటారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గిరిజన మ్యూజియం చిత్రం చూసిన పట్టణ ప్రజలు, సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపుతున్నారు.




ఐటీడీఏ పీవో రాహుల్‌తో మనీషా

# వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి
- నులి పురుగులను నివారిస్తేనే ఆరోగ్యం
- నేడు ఉమ్మడి జిల్లాలో మాత్రల పంపిణీ

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నేడు నులిపురుగుల నిర్మూలన కోసం సోమవారం జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు 'నులి పురుగుల నిర్మూలన దినోత్సవం', తప్పిపోయిన పిల్లలకు మాత్రలు అందించేందుకు 18న మాక్ అప్ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. 19 ఏళ్లలోపు వయసు గల వారందరికీ మాత్రలను అందించటానికి కార్యాచరణ రూపొందించారు. మట్టి ద్వారా వ్యాపించే నులిపురుగులు బాలల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పరాన్న జీవులైన ఇవి పిల్లలు తీసుకునే ఆహారాన్ని తినడం వలన వారు పోషకాహారం అందక రక్తహీనతకు గురై బలహీనంగా మారుతారు. దీంతో మానసిక, శారీరకంగా అనారోగ్యం పాలవుతారు. దీన్ని నివారించటానికి 2016 నుంచి ప్రభుత్వం నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పాటిస్తూ పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోంది. విద్యా శాఖ, ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలను ఏటా రెండు పర్యాయాలు అందజేస్తున్నారు. పాఠశాలలు,



అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో మాత్రలను పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

**పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి**

ఒక సంవత్సరం చిన్నారుల నుంచి కౌమారదశ 19సంవత్సరాల వయసు గల వారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,771 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు కళాశాలలు, మదర్సాలు, ఐటీఐ, ప్లేస్కూల్, భవిత పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది 3,36,136 మందికి అల్బెండజోల్ మాత్రలు వేయడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టారు.

**తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి..**

**భద్రాద్రి డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి**

నులి పురుగులను నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరు బాధ్యతగా అడుగులు వేయాల్సి ఉంది. ముఖ్యంగా తల్లిదండ్రులు ఆల్బెండజోల్ మాత్రలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఆహారం తినే సమయాల్లో ప్రతీసారి చేతులు కడుక్కోవడం, మలవిసర్జన అనంతరం చేతులు కడుక్కోవడం పట్ల పిల్లల్లో అవగాహన కల్పించాలి. పిల్లల ఆరోగ్యం, పోషకాహార స్థితిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పేగు నులి పురుగుల ఇన్‌ఫెక్షన్ల (నేల ద్వారా సంక్రమించే) గురించి అవగాహన పెంచుకోవాలి. నులి పురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనమైన మానసిక, శారీరక అభివృద్ధిని నివారిస్తుంది. పాఠశాల గైర్హాజరును తగ్గిస్తూ పిల్లల్లో చురుకుతనం పెంచుతుంది. అప్పుడే నులి పురుగుల నివారణ సాధ్యపడుతుంది.



**ఖమ్మం జిల్లాలో వివరాలు ఇలా :**

| | |
|---|---|
| జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లల గుర్తించింది | : 3,11,317 |
| మండలాలు | : 21 |
| యూపీహెచ్‌సీలు | : 26 |
| యూపీహెస్‌సీలు | : 4 |
| ప్రభుత్వ పాఠశాలలు | : 1263 |
| జూనియర్ కళాశాలలు | : 21 |
| ప్రైవేటు స్కూళ్లు | : 334 |
| మొత్తం స్కూళ్లు, జూనియర్ కాలేజీలు (6 నుంచి 19) | : 1618 |
| అంగన్వాడీ కేంద్రాలు | : 1840 |
| పిల్లలు (1నుంచి 15ఏళ్లు) | : 74,641 |
| 6నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు | : 95,276 |
| ప్రభుత్వ జూనియర్ కళాశాల పిల్లలు | : 6040 |
| ప్రైవేటు సూళ్లు, జూనియర్ కళాశాల పిల్లలు | : 1,35,360 |

**మాత్రల పంపిణీకి వినియోగించే సిబ్బంది :**

| | |
|---|---|
| మెడికల్ హెల్త్ సిబ్బంది | : 1260 |
| ఆశాలు | : 1339 |
| అంగన్‌వాడీ టీచర్లు | : 1750 |
| రిప్రజేంట్స్ | : 1618 |

# ఇరుజిల్లాల్లో ఘనంగా బోనాల వేడుకలు

- పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తుల తాకిడి
- మొక్కులు చెల్లించుకున్న మహిళలు


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి/పాల్వంచ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అమ్మోరు తల్లీ మా పిల్లా పాపలను చల్లంగా చూడు, పాడిపంటలు సంవృద్ధిగా అందించి మమ్ములను కరుణించి కాపాడు తల్లి అంటూ ఆదివారం జిల్లా వ్యాప్తం గా అమ్మవారికి బోనాలు సమర్పించారు. శ్రావణ మాసం మూడో ఆదివారం జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లాలో ముత్యాలమ్మ, మైసమ్మ, మారెమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ నూకాలమ్మ, పోచమ్మ తల్లుల ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా మహిళలు బోనాలు ఎత్తుకొని కోలాటాలు, డబ్బువాయిద్యాల నడుమ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు మహిళలు బోనాలు ఇంటి వద్ద తయారు చేసుకోని రాగ, మరి కొందరు ఆలయాల వద్ద బోనాలు తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. ఖమ్మం నగరంలోని చర్చికాం పౌండ్ ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వరదయ్యనగర్‌లోని మైసమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై బోనాలు సమర్పించారు. ఖైకొండాయిగూడెం రోడ్డులోని అంకమ్మ, మద్దిరావమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయంలో భక్తుల అమ్మవార్లకు బోనాలు సమర్పిచారు. 4వ డివిజన్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం, 1, 2, 3, 6 వ డివిజన్‌లలోని ముత్యాలమ్మ ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించారు.

**భక్తజనసంద్రమైన పెద్దమ్మతల్లి ఆలయం**

పాల్వంచ మండలంలోని కేవీ జగన్నాథపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తజనంతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడిలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను తీసుకున్నారు. భక్తులు బోనాలు సమర్పించారు. దేవాలయ ధర్మకర్తల మండల చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఈవో రజనీకుమారి భక్తులకు తాగునీటి సౌకర్యాలను కల్పించి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. క్యూలైన్లు ఏర్పాటు చేయడం వల్ల భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు చీకటి కార్తీక్, చౌగాని పాపారావు, రామిరెడ్డి, సుధాకర్, చెరుకూరి రాజశేఖర్, అడుసుమిల్లి సాయిబాబు, చందుపట్ల రమ్య పాల్గొన్నారు.


ఖమ్మంలో ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద సందడి

### ఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా

# చావా రవి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తాలో మూడు రోజుల పాటు జరిగిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 9వ జాతీయ మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన మహాసభలో జాతీయ అధ్యక్షుడిగా సీఎన్.భారతి కూడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెంట్రల్ కమిటీ మెంబర్‌గా సీహెచ్.దుర్గాభవాని, జనరల్ కౌన్సిల్ మెంబర్స్‌గా ఎ.వెంకట్, కే. జంగయ్య, ఆర్.శారదలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన ఉభయ రాష్ట్రాల నాటిక పోటీలు

### గెలుపొందిన నాటికలకు నగదు బహుమతుల ప్రదానం


అమ్మ చెక్కిన బొమ్మ నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నెల నెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీ లు ఆదివారంతో ముగిశాయి. నాలుగు రోజులుగా నగరంలో ని భక్తరామ దాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకు లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, (అ)సత్యం నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గోవాడ క్రియేషన్స్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక మానవ సమాజంలో గర్వంగా బ్రతకగలిగిన స్త్రీ, పురుష జాతులకు తోడు ట్రాన్స్‌జెండర్ జీవితం అందుకు భిన్నంగా ఉంటుందని ఆలోచింపచేశారు. చైతన్య కళా స్రవంతి ఉక్కునగరం వారు ప్రదర్శించిన (అ)సత్యం నాటిక మనుషులలో ఉంటే సత్యం అసత్యం మాటల విలువలను వివరించారు. ఆదివారం ముగింపు సందర్భంగా నిర్వహించిన సభకు పలువురు విద్యావేత్తలు వంగా సాంబశివారావు, మల్లెంపాటి శ్రీధర్, రవిమారుత్‌తో పాటు స్వామి రమేష్, వై.విక్రమ్, ఏదులాపురం వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ భైరు హరినాథ్‌బాబు, జాబిశెట్టి పాపారావులు హాజరై మాట్లాడారు. నాలుగు రోజులుగా ప్రదర్శించిన నాటికల్లో గెలుపొందిన నాటికలకు, కళాకారులకు బహుమతులు అందించారు. అనంతరం నంది అవార్డు గ్రహీత దేవేంద్ర రచించిన ఎక్కడమ్మ నువ్వు లేనిది నృత్య రూపకాన్ని పలువురు విద్యార్థులు ప్రదర్శించారు. అతిథులకు బహుమతులు, మెమొంటోలతో సన్మానించారు. ఈ నాలుగు రోజులు ప్రదర్శించిన నాటికలకు హాజరై వీక్షించిన ప్రేక్షకులకు, దాతలకు, కళాకారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, కొత్తూరు. దేవేంద్ర, చీఫ్ ప్యాట్రన్స్ నాగబత్తిని రవి, కురువెళ్ళ ప్రవీణ్, వేల్పుల విజేత, వేముల సదానంద్‌లు తెలిపారు. అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ (ఆర్ఫ్) ఖమ్మం. కళా పరిషత్, ప్రజానాట్య మండలి ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక కళాకారులు, ఇతర కళాకారులచే ప్రాచీన కళలను, కథలను నిర్వహిస్తూ కళాకారులకు గుర్తింపు వచ్చేలా ఈ నాటిక పోటీలు నిర్వహించిన నిర్వాహకులను ముఖ్యఅతిథులు అభినందించారు.

### జవహర్ ఎత్తిపోతల పథకం..

# భావోద్వేగ అనుబంధం

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ నిలబడిందన్నారు. వారు చేసినదానికి గుర్తింపుగానే జిల్లాకు మంత్రుల పదవులు దక్కడంతో పాటు ముఖ్యమైన శాఖలన్నీ జిల్లాకే దక్కాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతచేసినా తక్కువేనన్నారు. ఆనాడు జలగం వెంగళరావు నుంచి నేటి వరకు ఉమ్మడి ఖమ్మం రాష్ట్రానికి నాయకత్వం వహించేదన్నారు. సీతారామ ప్రాజెక్టు గతంలో ఉన్న ఇందిరా సాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టు రూ.2.5 వేల కోట్లతో అయిపోయేవని, కానీ వాటిని టీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత రీ డిజైన్ చేసి రూ.20వేల కోట్లు చేశారన్నారు. దానిపై భట్టి పదేళ్లపాటు ప్రతిపక్షంలో పోరాటం చేశారన్నారు. ప్రాజెక్టు రీడిజైన్ చేయడం తప్పు, పొరపాటు అయినప్పటికీ.. రూ.7వేల కోట్లు ఖర్చు చేశారు కాబట్టి దాన్ని పొరపాటుగా భావించినా సీతారామ పూర్తిచేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పుష్కలంగా పూర్తి చేసి గోదావరి జలాలు అందిస్తామన్నారు.

**రైతులకు ధైర్యానిచ్చే ప్రాజెక్టు 'జవహర్' : వాకిటి శ్రీహరి**

కాళేశ్వరం మాదిరిగా రూ. లక్షల కోట్లు ఖర్చు పెట్టి కూలిపోయిన విధంగా కాకుండా తక్కువ వ్యయంతో 30 వేల ఎకరాలకు నిరిచ్చే విధంగా డిజైన్ చేసి రెండు పంటలు పండించే రైతన్నలకు ధైర్యాన్నిచ్చే విధంగా జవహర్ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 10ఏళ్లు అధికారం ఏలినప్పటికీ.. డబుల్ బెడ్‌రూంలను కాగితాల మీద, బోర్డుల మీద, స్క్రీన్‌ల మీద చూపించిన బీఆర్‌ఎస్‌ను చెంపమీద కొట్టేలా నియోజకవర్గానికి 3500 ఇళ్లకు శ్రీకారం చుట్టామన్నారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన తనను మంత్రి పదవి ఇచ్చి జిల్లాకు ఇన్‌చార్జీగా కేటాయిస్తే ఇక్కడి నేతలను చూసి హనుమంతుడి ముందు కోతి గంతులేస్తే ఏమవుతుంది అన్న రీతిలో అనుకున్నానని అన్నారు. తొలుత భయమేసినా పెద్ద మంత్రుల ఆలోచన విధానంలో పని చేస్తున్నానన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అగ్రగామిగా నిలబెట్టాలన్న వారి తపన చూస్తుంటే అదృష్టవంతుడిగా భావిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీద, బడుగు బలహీన వర్గాల గురించి ఆలోచించే పార్టీ అని అన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ.. డబ్బులు ఎక్కడి నుంచి తీసుకొచ్చి రాష్ట్రాన్ని అగ్రగామిగా తీసుకెళ్తున్నారని, మేమేందుకు చేయలేకపోయామని బీజేపీ, బీఆర్‌ఎస్ ఆలోచనలో పడ్డారన్నారు. రాబోయే సంస్థాగత ఎన్నికల్లో బలాన్ని పెంచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

**మధిర ప్రజలకు వర ప్రదాయిని : మంత్రి పొంగులేటి**

మధిర నియోజకవర్గంలో రైతన్నలకు రెండు పంటలు పండే విధంగా జవహర్ ఎత్తిపోతల పథకం వర ప్రసాదం కానుందని మంత్రి పొంగులేటి అన్నారు. పేదోడి ప్రభుత్వం మాట ఇస్తే తప్పదన్నారు. ప్రస్తుతం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లతోపాటు అర్హులైన వారందరికీ రాబోయే మూడేళ్లలో మూడు విడతల్లో ప్రతీ గ్రామంలో ఇళ్లు ఇస్తామన్నారు. ప్రతీ సోమవారం నాడు కట్టిన లెవల్‌ను బట్టి ఫౌండేషన్‌కు రూ. లక్ష, స్లాబ్ లెవల్‌కు రూ. లక్ష, స్లాబ్ వేస్తే రూ. 2 లక్షలు, గృహ ప్రవేశం చేస్తే రూ.లక్ష. చొప్పున ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టులో మొలుగుమాడులో భూ సమస్యలు పరిష్కరించినట్టుగా.. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆ రోజు ధరణితో కష్టపడి, నష్టపోయి గోస పెట్టుకున్నారో వారందరికీ చుట్టంలా ఉండే భూ భారతి చట్టం వచ్చిందన్నారు. ఆగస్టు 15 నుంచి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సమస్యలు శాస్వతంగా పరిష్కరించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. పేదోడి చల్లగా ఉండటం కోసం, అండగా ఉండటం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.


మంత్రులకు గజమాల వేస్తున్న నాయకులు

**పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా కట్టని కేసీఆర్ : మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్క ఇల్లు అయినా కట్టాడా? సన్న బియ్యం, ఇచ్చాడా? అని ప్రశ్నించారు. మరీ అలాంటి పార్టీకి స్థానిక సంస్థల్లో ఆయనకు ఓటేస్తారా? అని ప్రశ్నించారు. రోడ్ల గుంతలు పూడ్చకపోవడంతో ఎంతోమంది చనిపోయారన్నారు. వంగవీడు రోడ్డు కూడా రూ. 12వేల కోట్లతో డబుల్ రోడ్డు వేస్తున్నామన్నారు. మారుమూల ప్రాంతంలో జవహర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ సీఈ రమేష్, ఏఎంసీ ఛైర్మన్ బండారు నర్సింహారావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుకాసురులు!



(5వ పేజీ తరువాయి)

చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు, సత్తుపల్లి ప్రాంతానికి చెందిన వారితో కలిసి బహిరంగంగా దందా చేస్తున్నారు. సత్తుపల్లికి తరలించిన ఇసుకను పెద్ద కట్టడాల వద్దకు తరలించి విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా, ఓవర్ లోడ్ టన్నేజితో సహా ఇతర నిబంధనలకు పాతరేసి అక్రమ వ్యాపారం సాగుతున్నా.. పట్టించుకునే వారు లేకపోవడం దారుణం. దీంతో ఆంధ్రా నుంచి సత్తుపల్లి పట్టణానికి ఇసుకను తరలిస్తూ.. కొందరు ఇళ్ల నిర్మాణ మెటీరియల్ విక్రయించేవారు దర్జాగా డంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా పట్టణంలో ఎక్కడ చూసినా అక్రమ ఇసుక డంప్‌లే కనిపిస్తున్నాయి. ఇసుక డంప్‌లకు ఏ రకమైన అనుమతులు లేకున్నా.. వ్యాపారం మాత్రం జోరుగా సాగుతోంది.

**పెద్ద మొత్తంలో వసూళ్లు**

అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్న వారి పేర్లు బహిరంగ మార్కెట్లో జోరుగా ప్రచారం సాగుతుండడంతో.. వీరి నుంచి కొందరు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. మరికొందరు ఆంధ్రా ప్రాంతం నుంచి సరిహద్దు గ్రామాల్లోకి ఇసుక లారీలు రాగానే అక్కడే కొందరు బెదిరించి సొమ్ము చేసుకుంటున్నారు. అదే సమయంలో కొందరు ఇసుక వ్యాపారులు.. రాజకీయ నాయకులను ఆశ్రయించి వారి అండదండలతో ఇసుక రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కఠిన చర్యలతోనే అడ్డుకట్ట సాధ్యం**

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి దర్జాగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అడ్డుకోవాలంటే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇసుక అక్రమ లారీ పట్టుబడిన సమయంలో.. సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపాలని కొందరు సూచిస్తున్నారు. అలాగే ఇసుక లారీ పట్టుబడిన సమయంలో దానికి సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగించాలి. అంతే కానీ ఇసుక లారీ పట్టుబడగానే దానిలోని ఇసుకను అన్‌లోడ్ చేసి, సాధారణ జరిమానాతో సరిపెట్టి.. లారీని విడిచిపెట్టటం వల్ల అక్రమార్కుల్లో ఏ మాత్రం భయం ఉండడం లేదు. ఫలితంగా అక్రమార్కులు తిరిగి మళ్లీ యథేచ్ఛగా ఇసుకను దందా కొనసాగిస్తున్నారు.

# పాలకపక్షం చేయదు.. ప్రతిపక్షం అడగదు!

పినపాక /ఇల్లెందు టౌన్, 11 ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పాలక పక్షం హామీలు అమలు చేయకపోతే.. ప్రతిపక్షంగా ఉన్న రాజకీయ పార్టీలు అడగలేని దుస్థితిలో ఉన్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోని ఇల్లెందుతో పాటు పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశం జరిగింది. ఆయా సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని నడిపిస్తున్న పాలక పక్షం హామీలను అమలు చేయకపోతే.. ప్రతిపక్షంగా ఉన్న రాజకీయ పార్టీలు నిలదీయలేని దుస్థితిలో ఉందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. కాంగ్రెస్ దివ్యాంగులకు ఇస్తానన్న రూ.6 వేల చేయూత పింఛన్, వృద్ధులకు 4వేల హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. పక్కనున్న ఏపీ సీఎం చంద్రబాబు అక్కడి దివ్యాంగులకు రూ.15వేల పింఛన్ ఇస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం ఎందుకు ఇవ్వదని ప్రశ్నించలేని దిక్కుమాలిన ప్రతిపక్షం ఈ రాష్ట్రంలో ఉందన్నారు. అధికారంలో ఉన్నా గడీల్లో, ఫాంహౌస్‌ల్లోనే ఉండడం.. ప్రతిపక్షంగా ఉన్నా గడీల్లో, ఫాంహౌస్‌ల్లోనే ఉండి రాజకీయాలు చేసే ఏకైక అసమర్థ ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ పేరు గడించాడన్నారు. అధికారం ఉంటేనే ప్రజల కోసం పని చేస్తారా!?, లేకపోతే ప్రజల కష్టాలు పట్టవా!? అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కండరాల క్షీణత కలిగిన వారికి రూ. 15 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, వితంతువులకు రూ. 4 వేల పింఛన్ హామీలను అమలు చేయాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఇక మోసపోవద్దని ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా దివ్యాంగుల మహా గర్జన సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు వేలాదిగా దివ్యాంగులు తరలి వచ్చి పాలక పక్షానికి కనువిప్పు కలిగించాలని కోరారు. ఆయా సమావేశాల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు, జిల్లా నేతలు వసంతరావు, వల్లెపోగు వెంకటేశ్వర్లు, సోంపల్లి తిరుపతి, దివ్యాంగుల సంఘం జిల్లా నాయకులు జాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డీలర్ల డీలా!

(5వ పేజీ తరువాయి)

సహాయకులను నియమించుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం వీటికి ఎలాంటి బిల్లులు చెల్లించలేదు. అంతే కాకుండా కమీషన్ కూడా ఇవ్వకపోవడంతో రేషన్ డీలర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సెప్టెంబర్‌లో బియ్యం షాపులో దింపుకోవడానికి హమాలీ ఛార్జీలు చెల్లించే పరిస్థితిలో కూడా డీలర్లు లేరంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని 748 రేషన్ షాపుల ద్వారా ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా కనీసం 6వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డీలర్లు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఒక్కో డీలర్‌కు క్వింటాకు రూ. 140 రూపాయలను చెల్లిస్తుంది. ఈ లెక్కన ఖమ్మం జిల్లాలో 6వేల మెట్రిక్ టన్నుల బియ్యానికి నెలకు సుమారు రూ. 40లక్షలను డీలర్లకు చెల్లించాల్సి ఉంది. ఐదు నెలలుగా అంటే రూ. 2కోట్ల మేర బకాయిలు ఉన్నాయి.

**డీఎస్‌వో ఏమంటున్నారంటే..!**

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రాష్ట్రంలో డీలర్లకు నేరుగా కమీషన్‌ను చెల్లించేదని, తాజాగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం విడివిడిగా డీలర్లకు కమీషన్‌ను చెల్లించేలా చర్యలు తీసుకుంటోందని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి ట్రెజరీ ద్వారా డీలర్లకు చెల్లింపులు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. డీలర్ల వివరాలను ట్రెజరీ ద్వారా చెల్లింపులకు జాబితాలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో డీలర్ల కమీషన్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందన్నారు.

**గతంలో మాదిరిగా ఒకే కమీషన్‌ను చెల్లించాలి**

**జానీమియా ( రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి)**

రేషన్ డీలర్లకు గతంలో ప్రభుత్వం చెల్లించిన విధంగానే కమీషన్ ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా ఇవ్వడం వల్ల డీలర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికే కొంత మంది డీలర్లు ప్రతినెలా డబ్బులు చెల్లించి బియ్యాన్ని తీసుకోవాలంటేనే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇవ్వాల్సిన కమీషన్‌కు కూడా ఇలాంటి కొర్రీలు పెట్టడం వల్ల మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కనీసం ఇకనైనా ఒకే కమీషన్ విధానాన్ని డీలర్లకు వర్తింపజేయాలి.

# ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట





హైదరాబాద్ వెళ్ళేందుకు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

బస్సు రన్నింగ్‌లోనే సీటు కోసం తిప్పలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొనటంతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగల నేపథ్యంలో శుక్ర, శని, ఆదివారాల్లో ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ప్రయాణికులకు సరిపడ బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ ప్రయాణికులు బస్సు రాగానే గుంపులు గుంపులుగా బస్సు ఎక్కేందుకు ముందుకు రావటంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ రూట్‌కు ఉన్న రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికంగా బస్సులను ఏర్పాటు చేశామని రీజనల్ మేనేజర్ సరిరాం, డిపో మేనేజర్ దినేష్‌కుమార్‌లు తెలిపారు. ఈ మేరకు ప్రయాణికుల రద్దీతో వారికి ఇబ్బందులు కలగకుండ మరో 40 బస్సులను ముందస్తు ప్రణాళికతో అందుబాటులో ఉంచామని తెలిపారు.

## రామయ్య మూలవరులకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం మూలవరులకు ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం, తలంబ్రాలను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## రామయ్యను దర్శించుకున్న ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్



భద్రాచలం రామాలయంలో మంత్రి

భద్రాచలం/ దుమ్ముగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఏపీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, రామాయణ పారాయణదారుడు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, టీడీపీ నాయకులు తాళ్లూరి చిట్టిబాబు, అబ్బినేని శ్రీనివాసు, వల్లభనేని చందు, శ్రీకాంత్ పాల్గొన్నారు. అనంతరం పర్ణశాల రామయ్యను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, డీఎస్పీ అశోక్, భద్రావలం సొసైటీ చైర్మన్ అబ్బినేని శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## సింగరేణి యాజమాన్యమే నూతన బొగ్గుబ్లాక్‌లను స్వాధీనం చేసుకోవాలి

**వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యమే నూతన బొగ్గుబ్లాక్‌లను స్వాధీనం చేసుకుని బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆదివారం శేషగిరిభవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కోయగూడెం ఓపెన్‌కాస్టు, తాటిచర్ల-2, భూపాలపల్లి, సత్తుపల్లి ఓసీ-3 ఓపెన్‌కాస్టులను ప్రైవేట్ సంస్థలకు అప్పచెప్పేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విజిలెన్స్ అధికారులు నిఘా ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. ఇటీవల సింగరేణి సంస్థలో ఫారెస్ట్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్లరికల్ పోస్టులను అర్హులైన వారికి అప్పచెప్పేందుకు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో నాయకులు ఎస్‌వి. రమణమూర్తి, వీరస్వామి, కిష్టాఫర్, రాములు, శ్రీనివాస్, కమల్, రాము, సాంబమూర్తి, మధుకృష్ణ, రాజేశ్వరరావు, ప్రసాద్, తిరుపతి, రాంశంకర్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

కల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై ఆదివారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని లింగాల గ్రామానికి చెందిన డి .వెంకట్రావు, ఎం.రాజేష్, డి.అశోక్‌లు కులం పేరుతో దూషించి అవమానపరిచినందుకు వాచ్యానాయక్ తండాకు చెందిన బానోతు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కల్లూరు ఏసీపీ రఘు విచారణ జరిపారు. స్థానికంగా స్వాగత్ రెస్టారెంట్ వద్ద మేయర్ ఆగ్రో మందుల కంపెనీ వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చిన విందులో పాల్గొన్న ప్రసాద్‌ను కులం పేరుతో దూషించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై విచారణ జరిపి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

## జిల్లా టీటీ జట్ల ఎంపిక



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఖమ్మంతో పాటు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే జిల్లా టేబుల్ టెన్నిస్ జట్లను ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. ఎంపికలను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పోటీలలో సత్తా చాటి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి ప్రకటించారు. కార్యక్రమంలో బాలభారతి పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డాక్టర్ సుధీర్, జోజి చాకో, మజహర్, పరిటాల చలపతి, రెడ్డిసాయి శివ, గద్దల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్ నిర్మాణంలో ఆదివాసీలకు అన్యాయం

**378 మంది బినామీలకు నష్ట పరిహారాలు**

**సీఎం రేవంత్ ఆదివాసీలను ఆదుకోవాలి**

**ఆదివాసీ జాతీయ గిరిజన అభ్యుదయ సంఘం చైర్మన్ చందా లింగయ్య దొర**



సమావేశంలో మాట్లాడుతున్న చందా లింగయ్య దొర, భూ నిర్వాసితులు

మణుగూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మణుగూరు, పినపాక సరిహద్దు గ్రామాల మధ్య నెలకొల్పిన భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ ఏర్పాటులో భూనిర్వాసితులైన ఆదివాసీ గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన జాతీయ అభ్యుదయ సంఘం చైర్మన్, జడ్పీ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర ఆరోపించారు. ఆదివారం మణుగూరు పట్టణంలోని డీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీ బీటీపీఎస్ భూ నిర్వాసిత కమిటీ సభ్యులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదేళ్లుగా 378 మంది ఆదివాసీ గిరిజన భూ నిర్వాసితులు ప్యాకేజీ రాలేదంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని తెలిపారు. వీరి స్థానంలో నాటి వీఆర్‌వోల చేతి వాటం వలన బినామీలు నష్టపరిహారం పొందారని అసలైన భూ నిర్వాసితులు అయిన ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. బీటీపీఎస్ నిర్మాణానికి సంబంధించి గిరిజనులకు చెందిన 2168ఎకరాల్లో 480మంది ఆదివాసీలను భూ నిర్వాసితులుగా గుర్తించగా అందులో కేవలం 78మందికి మాత్రమే తగిన నష్టపరిహారం, ఉద్యోగాలు లభించాయి. కానీ 378 మంది నిర్వాసితులు నేటికీ తమకు న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు వారికి చెల్లించే నష్టపరిహారం విషయంలో దాదాపు రూ.400 కోట్ల మేర నిధుల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. నాటి రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది వైఖరి వల్ల ఆదివాసీలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జరిగిన అవినీతి అక్రమాలపై ఎంక్వైరీ కమిషన్ వేసి నష్టపోయిన ఆదివాసీ భూ నిర్వాసితులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఈ నెల 12వ తేదీన బీటీపీఎస్ గేట్ ఎదురుగా స్థానిక ఆదివాసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన కొమరంభీం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నాటి బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి సీతక్క ద్వారా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలోనైనా బీటీపీఎస్ భూ నిర్వాసితులు అయిన ఆదివాసీ గిరిజన కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భూ నిర్వాసిత కమిటీ సభ్యులు వజ్జా నర్సింహారావు, గొగ్గల రామకృష్ణ, కుంజా వెంకటరమణ, చిడెం నాగేశ్వరరావు, వడి నాగశంకర్, కొమరం రామ్మూర్తి, కొమరం శ్రీను, పాల్వంచ వెంకటేశ్వర్లు, ఏనిక మంగమ్మ, పొడెం నర్సమ్మ, కుంజా ఆదిలక్ష్మి, పూనెం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వైరా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పేకాట ఆడుతున్న 13 మందిని వైరా పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం అందిన సమాచారం మేరకు వైరా ఎస్ఐ పుష్పాల రామారావు సిబ్బందితో కలిసి ఆకస్మికంగా పేకాట స్థావరంపై దాడిచేశారు. సిరిపురం, స్టేజీ పినపాక గ్రామాలకు చెందిన 13 మంది పేకాట రాయుళ్లను పట్టుకొని వారి నుంచి రూ.4250 నగదు, ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

## తల్లి మరణంతో కుమారుడి ఆత్మహత్య

వేంసూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తల్లి అనారోగ్యంతో మృతిచెందగా కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మంజిల్లా వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామంలో శుక్ర, శనివారాల్లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మారోజు పుల్లమ్మ(70) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. పుల్లమ్మ మృతి వార్త తెలుసుకున్న కుమారుడు మారోజు కరుణాకర్(33) హైదరాబాద్‌లో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లీకుమారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఒకవైపు పెన్షనర్లు.. మరోవైపు ఉద్యోగులు

**ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగులు**

**నేటి నుంచి పెన్షనర్లు,**

**15 నుంచి ఉద్యోగుల ఉద్యమం**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలపాటు సమాజానికి సేవలు అందించిన ఉద్యోగులు రిక్తహస్తాలతో పదవి విరమణ చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని పెన్షనర్లు ఆందోళనకు సిద్ధమైతే తాము దాచుకున్న సొమ్మును ఇవ్వకపోగా రావాల్సిన బకాయిలు సకాలంలో రాకపోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉద్యోగులు ఆందోళన బాట చేపట్టబోతున్నారు. ఈ నెల 11న పెన్షనర్లు, అలాగే ఉద్యోగులు ఈ నెల 15నున ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సహాయ, సహకారాలు అందడం లేదని, నతమ గోడును పట్టించుకునే వాడే కరువయ్యాడని పెన్షనర్లు, ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.700 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తమ పిల్లల పెళ్లిళ్లకు, వృద్ధాప్యంలో ఆస్పత్రుల ఖర్చుల కోసం, గృహ నిర్మాణాల కోసం జీపీఎఫ్ రూపంలో దాచుకున్న సొమ్మును కూడా విడుదల చేయకుండ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన కంట్రిబ్యూషన్ ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం తెస్తామనే ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఉదాసీన వైఖరిని అవలంబిస్తుందని, తమకు ఇచ్చిన మాటపైన నిలబడలేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 15 తర్వాత విశ్వరూపం చూపిస్తామని ఉద్యోగుల జేఏసీ, టీఎన్జీవోల సంఘం నాయకులు హెచ్చరించారు. నెలకు రూ.700 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని, కంట్రిబ్యూషన్ ఆధారిత ఎంప్లాయీస్ హెల్త్‌స్కీంను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.

జీపీఎఫ్ బిల్లులు ఇవ్వడం లేదని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం లేదని ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పిల్లల వివాహాలు చేయలేకపోతున్నామని ఆరోపించారు. కుటుంబం గడవడానికి చేసిన అప్పులు తీర్చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇతర సంక్షేమ పథకాలకు వాడటం వల్ల తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పీఆర్సీ గురించి ఎలాంటి ప్రస్తావన చేయడం లేదని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని, ఇప్పుడు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇదివరకే మంత్రులు, అధికారుల కమిటీలు ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రభుత్వం మళ్లీ కమిటీల పేరిట కాలయాపన చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఈ నెల 15 తర్వాత ప్రత్యక్ష పోరాటానికి దిగి విశ్వరూపం చూపిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలనే ఆచరణలో పెట్టాలని అడుగుతున్నామని, ఇంకెన్నాళ్లు ఓపికి పట్టాలని ప్రశ్నించారు. ఈ నెల 15 వరకు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చామని వెల్లడించారు. ఉద్యోగులు అసహానానికి గురికాక ముందే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

## అక్రమ ఇసుక వాహనాల పట్టివేత



సత్తుపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన టిప్పర్ లారీ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వాహనాలను సత్తుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి మండలం గంగారం మీదుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్, మరోక ఇసుక లారీను సత్తుపల్లి పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టీ.శ్రీహరి తెలిపారు.

**వైరాలో ఇసుక లారీ పట్టివేత.. ముగ్గురిపై కేసు**

వైరా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ నుంచి ఇసుక రవాణా చేస్తున్న లారీని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు పట్టుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం వైరాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తల్లాడ వైపు నుంచి వస్తున్న ఏపీ27 టీజెడ్ 2497 నెంబర్ గల లారీని తనిఖీ చేయగా ఇసుక లోడ్‌తో ఉంది. ఆ ఇసుకకు సంబంధించి ఎలాంటి అనుమతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ బాలకృష్ణ, యజమాని వెంకటేశ్వరరావు, ఇసుక రవాణాకు సహకరిస్తున్న వైరాకు చెందిన బాణోతు కృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాలుగు మట్టి ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. మండలంలోని పేరాయిగూడెం నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ మేరకు తహసీల్దారు రామకృష్ణకు సమాచారం అందడంతో సిబ్బందికి ఆదేశాలు ఇవ్వగా రెవెన్యూ సిబ్బంది వెళ్లి నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

## ఉద్యమనాయకురాలు తూతా నాగమణి మృతి

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా, దిండిగల రాజేందర్**




నాగమణి (ఫైల్)

దమ్మపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : దమ్మపేట మండలం వడ్లగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకురాలు, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు అయిన ఉమ్మడి ఖమ్మంజిల్లా శిశుసంక్షేమ శాఖ మాజీ కోఆర్డినేటర్ తూతా నాగమణి (70) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారితో పాటు మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, బీఆర్ఎస్ రాష్ట్ర యువజనవిభాగ నాయకుడు పర్వతనేని రామకృష్ణ, ప్రధానకార్యదర్శి దొడ్డా రమేష్, వెంపటి భరత్ ఉద్యమ నాయకులు మంతపురి రాజుగౌడ్, షేక్ మునీర్, లలిత్‌పాషా, అబ్దుల్‌జిన్నా, గాజుబోయిన ఏసుబాబు, పెంటపాటి సతీష్, కొర్సా వెంకటేష్, రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, సోయం వీరభద్రం, యార్లగడ్డ బాబు, పి.చిట్టిబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

## పురుగు మందు పిచికారీ చేసిన యువకుడిమృతి

**మరో వ్యక్తి పరిస్థితి విషమం**



సిద్ధు (ఫైల్)

గుండాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు పిచికారి చేసిన యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం గుండాల మండలంలో జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం గుండాల మండలం, కాంచనపల్లి గ్రామంలోని ఒడ్డరి గుంపుకు చెందిన సంపంగి సిద్ధు(17) ఈ నెల 8న అదే గ్రామానికి చెందిన వర్స మహేష్ అనే రైతు వద్దకు పొలంలో పరుగు మందు పిచికారి చేసేందుకు కూలికి వెళ్లాడు. కాగా అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన సిద్ధుకు తీవ్రంగా వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. కాగా 9వ తేదీన మరోసారి సిద్ధుతో పాటు, వర్స మహేష్‌కు వాంతులు కావడంతో ఇద్దరినీ ఇల్లెందులో ఓ ఆర్ఎంపీ వద్దకెళ్తే ప్రథమచికిత్స చేశారు. కానీ ఆదివారం తెల్లవారుజామున సిద్ధు, మహేష్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో ఆర్ఎంపీ తన కారులో ఖమ్మం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడ నుండి ప్రభుత్వాస్పత్రికి తీసుకేళ్లగా అప్పటికే సిద్ధు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రైతు మహేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సిద్ధు తండ్రి చిన్నవెంకన్న కుమారుడు పురుగు మందు పిచికారి వలనా..? లేక ఆర్ఎంపీ వైద్యం వికటించి మృతి చెందాడో తెలియడం లేదని అనుమానం వ్యక్తంచేస్తూ ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## సింగరేణి క్వార్టర్స్‌లో దొంగల హల్‌చల్

◆ **సీసీ కెమెరాలో రికార్డయిన ముగ్గురు నిందితులు**



సీసీ కెమెరాకు చిక్కిన దొంగలు

సత్తుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని సింగరేణి ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఉద్యోగులకు సంబంధించి ఐదు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీ చేశారు. ఈ ఘటన మొత్తం ఒక ఇంటిలో ఏర్పాటు చేసివున్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. కెమెరాలో రికార్డ్ అయిన వీడియో ప్రకారం ముగ్గురు వ్యక్తులు మాత్రం ఇంటిలోకి ప్రవేశించినట్లు కనిపి స్తోంది. మూడు రోజులు సెలవలు కావడంతో ఉద్యోగుల ఇళ్లకు తాళాలు వేసి ఉండడం గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు చోరీ ఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సత్తుపల్లి పట్టణ సీఐ టీ.శ్రీహరి దర్యాప్తు ప్రారంభించారు. టాస్క్‌ఫోర్స్ క్లూస్ టీమ్ వివరాలను సేకరించారు. ఐదు ఇళ్లల్లో ప్రాథమిక సమాచారాన్ని సేకరించగా రూ.75 వేల నగదు, 80 గ్రాముల బంగారం, 1220 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. దీనిని పోలీసులు నిర్ధారించాల్సి ఉంది.

**గౌతమీనగర్ కాలనీలో చోరీకి యత్నం**

అశ్వాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అశ్వాపురం హెవీవాటర్ ప్లాంట్ ప్రాంతంలోని గౌతమీనగర్ కాలనీలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఈసంఘటనపై ఆదివారం అశ్వాపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాలనీలోని డి-1బ్లాక్‌కు చెందిన ఎంట్రపాటి అజయ్‌కుమార్ క్వార్టర్‌లో దొంగలు చోరీకి యత్నించారు. ఈ సందర్భంగా కాలనీ సెక్యూరిటీ సిబ్బంది, పెట్రోలింగ్ పోలీసులు సకాలంలో స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోగానే దొంగలు పరారైనట్లు అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. స్థానికులు ఇళ్లల్లో ఎక్కువమొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకుండా జాగ్రత్తపడాలని, ఊరికి వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

## రూ.కోటికి పరువునష్టం దావా

ఖమ్మం లీగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులుపెట్టి తీవ్ర మనోవేదనతో పాటు డబ్బు, సంఘంలో తమ గౌరవ మర్యాదలకు నష్టం కలిగించిన ఓ వ్యాపారి ఓం నారాయణ ఖండేల్‌వాల్, అప్పటి ఎస్ఐ ఓంకార్ యాదవ్‌పై రూ.కోటిలకు ఖమ్మం కోర్టులో బాధితులు సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు దాఖలు చేశారు. వివరాల ప్రకారం 2006కు ముందు తిరుమలాయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని 2.33 ఎకరాల భూమిని మద్దినేని శ్రావణ్‌కుమార్‌కు తన తాత రంగయ్య గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. శ్రావణ్ పేరుపై పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలని తిరుమలాయపాలెం ఎమ్మార్వోకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఓం నారాయణ కండేల్‌వాల్ సదరు భూమి కౌలుదారు కాంపాటి వెంకటేశ్వర్లుతో కుమ్మక్కై అక్రమ మార్గంలో కౌలుదారు పేరుపై పాసుపుస్తకం పొందారు. సదరు పాసుపుస్తకాన్ని రద్దుచేయాలని బాధితులు ఖమ్మం ఆర్డీవో వద్ద అప్పీలు, కోర్టులో డిక్లరేషన్ దావా దాఖలుచేశారు. 2012లో తిరుమలాయపాలెం ఎమ్మార్వో కార్యలయం సిబ్బందితో కలిసి రికార్డులు ట్యాంపరింగ్ చేసి పాసుపుస్తకం పొందటంతో ఖండేల్‌వాల్, వెంకటేశ్వర్లుతో పాటు రెవెన్యూ సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదైంది. అనంతరం కోర్టు స్థానిక ఎమ్మార్వో తీరును తప్పుబడుతూ వారిద్దిరకీ జారీ అయిన పాసుపుస్తకాలను రద్దుచేస్తూ తీర్పు చెప్పింది. ఖమ్మం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు సైతం సదరు పాసుపుస్తకాలు రద్దుచేసి శ్రావణ్‌కుమార్ పేరుపై ఆ భూమిని నమోదుచేసి పాసుపుస్తకాలు జారీచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఈ తీర్పుపై జిల్లా కోర్టులో అప్పీలు చేయగా కింది కోర్టు తీర్పు సరైనదేనని పేర్కొంటూ డిస్మిస్ చేశారు. హైకోర్టులోనూ వారికి అదే పరిస్థితి ఎదురైంది. సుప్రీంకోర్టులోనూ వారి అప్పీలును కొట్టేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వారు అప్పటి తిరుమలాయపాలెం ఎస్ఐ ఓంకార్ యాదవ్‌తో కుమ్మక్కై శ్రావణ్‌కుమార్, అతడి తండ్రి వెంకటేశ్వర్లుపై క్రిమినల్ కేసు నమోదుచేశారు. శ్రావణ్‌ను ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లకుండా చేశారు. ప్రైవేటు ఉద్యోగాలు చేసుకోనివ్వకుండా మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. చివరికి వారు నమోదుచేసిన క్రిమినల్ కేసును కూడా కోర్టు కొట్టివేసింది. దాదాపు పదేళ్లకు పైగా శ్రావణ్‌కుమార్, తన తండ్రి వెంకటేశ్వర్లును అన్ని విధాలా నష్టపరచడంతో పాటు సంఘంలో గౌరవ మర్యాదలకు భంగం కలిగించారని పేర్కొంటూ ఖండేల్‌వాల్, ఎస్ఐ ఓంకార్ యాదవ్‌లపై రూ.కోటి లకు ఖమ్మం జిల్లా కోర్టులో సివిల్ డిఫమేషన్ కేసుదాఖలు చేశారు. అదేవిధంగా ఈ ఇద్దరిపై ఖమ్మం ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు దాఖలుచేశారు. పిటీషనర్ల తరుపున న్యాయవాదులు కిలారు లక్ష్మీనర్సింహారావు, గొల్లపూడి రామారావు వాదిస్తున్నారు.





## గాఢాంధకారంలో వైరా రింగ్‌సెంటర్

వైరా, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న రింగ్‌రోడ్డు సెంటర్, మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో వీధి లైట్లు వెలగకపోవడంతో గాఢాంధకారం నెలకొంది. మూడురోజుల నుంచి వీధిలైట్లు వెలగనప్పటికీ మునిసిపల్, ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. రింగ్‌రోడ్డు సెంటర్ వద్ద జాతీయ ప్రధాన రహదారిపైన ఉన్న నాలుగు హైమాస్ లైట్లు వెలగటంలేదు. దాంతో రింగ్ రోడ్డు మొత్తం చీకటిమయంగా మారింది. వాహనాల లైట్ల వెలుతురు మాత్రమే కన్పిస్తుంది. ఈ రింగ్‌రోడ్డు నుంచి మధిర-జగ్గయ్యపేట రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డు రోడ్డు, ఇందిరమ్మ కాలనీ వరకు దాదాపు రెండు కి.మీ. వీధిలైట్లు వెలగక గాఢాంధకారం నెలకొంది.

## కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 11నుంచి 15వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖ అధికారి నాగపద్మజ, జీసీడీవో తులసి తెలిపారు. ఇంటర్‌మొదటి సంవత్సరంలో ఎర్రుపాలెంలో ఎంపీసీ, బైపీసీలో 23సీట్లు, పెనుబల్లి ఎంపీసీ, బైపీసీ34, సింగరేణి ఎంపీసీ, బైపీసీ20, లింగాల సీఈసీ24, బోనకల్‌సీఈసీ24, కూసుమంచి సీఈసీ23, ఏన్కూరుసీఈసీ14, కొణిజర్ల సీఈసీ15, ముదిగొండ ఎంపీసీ 8 ఖాళీలకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

## రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోండి



కూసుమంచి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కొత్తగా పాస్‌బుక్ పొందిన రైతులు రైతుబీమాకోసం దరఖాస్తు చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి కోరారు. ఈనెల 13తేదీ ఆఖరు తేదీ అని, దరఖాస్తు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే సంబంధిత ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు భూమి పాస్ బుక్ జీరాక్స్, రైతు ఆధార్ కార్డు, నామినీ అధార్‌కార్డు జతపరిచి రైతు స్వయంగా అందజేయాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు వారి వివరాలు సరిచూసుకోవాలన్నారు.

## తప్పిన ప్రమాదం

తిరుమలాయపాలెం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిచెట్టుతండాలో ఆదివారంగిరిజనులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. తండాలో విద్యుత్ పోల్ ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థంభాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఒక్కసారిగా స్తంభం కుప్పకూలి కిందపడింది. బోనాల పండుగ సందర్భంగా గిరిజనులు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్‌స్థంభం కూలినప్పుడు అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ అధికారులు స్తంభం పాతి విద్యుత్ తీగల ఏర్పాటు చేయడంలో జాప్యం వల్ల ఈ ఘటన జరిగిందని తండావాసులు చెబుతున్నారు.

తండాలో కూలిన విద్యుత్ స్తంభం



# ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

రఘునాథపాలెం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఆదివారం బోనాల వేడుకలను నిర్వహించారు. మహిళలు బోనాలను సమర్పించారు. గ్రామస్థులతో కలిసి ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ సామూహిక సంప్రదాయ నృత్యాలు చేశారు. వేపకుంట్ల, రఘునాథపాలెం ఇతర గ్రామ పంచాయతీల్లో బోనాల వేడుకలు జరిపారు.

**ఘనంగా గంగాభవాని బోనాల వేడుకలు**

ఖమ్మంచర్చికాంపౌండ్: ఖమ్మం నగరంలోని మున్నేటి ఒడ్డున వేంచేసి ఉన్న గంగాభవాని దేవాలయలో శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా బెస్తసంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. డప్పువాయిద్యాలతో, పోతురాజుల విన్యాసాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు సామూహిక బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. మున్నేటి నీటిని గంగమ్మకు అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కన్నం రమేష్, కార్యదర్శి గోధుముల శ్రీనివాసరావు, జిల్ల గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్నకృష్ణ, కార్పొరేటర్ కన్నం వైష్ణవి, చేతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాలవేడుకలను నిర్వహించారు. మండలంలోని పిండిప్రోలు, రాజారం, జూపెడ, ఎర్రగడ్డ, తిరుమలాయపాలెం గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాలు సమర్పించారు.

కూసుమంచి: కూసుమంచి, నేలపట్ల, కొత్తూరు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. మొదట బొడ్రాయికి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు దేవతలకోసం నైవేద్యాలను సమర్పించేందుకు ప్రత్యేకంగా తయారు చేసుకుని మేళతాళాలతో ఎడ్లబండి ప్రభలతో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తల్లికి సమర్పించారు.



గంగమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు



కూసుమంచిలో బోనాలతో వెళుతున్న మహిళలు



వేపకుంట్లలో పూజలు చేస్తున్న భక్తులు

### ఉత్సాహంగా తీజ్ వేడుకలు

ఖమ్మంరూరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాలో ఆదివారం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ గిరిజనుల సంప్రదాయ పండుగ తీజ్ వేడుకలను ఏటా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.



## బీహార్‌లో తొలగించిన ఓట్లను నమోదు చేయాలి

నేలకొండపల్లి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో తొలగించిన ఓట్లను వెంటనే తిరిగి ఓటర్ల లిస్టులో చేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని, బీహార్‌లో తొలగించిన ఓట్లను తిరిగి ఓట్ల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో ధర్నా చేశారు. అనంతరం పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కేవీరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం బీజేపీతో చేతులు కలిపి ఓట్లను తొలగించటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. తొలగించిన ఓట్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చక పోతే సీపీఎం దేశ వ్యాప్త ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, రచ్చా నర్సింహారావు, బలుసు ప్రమీల, బెల్లం లక్ష్మి, గడిపూడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనాకు ప్రపంచమే మద్దతు పలికింది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా ప్రజలకు ప్రపంచ దేశాలు మద్దతు పలికాయని, ఖమ్మంలో జరిగిన సంఘీభావ ర్యాలీని బీజేపీ ప్రశ్నించటం అమానవీయమని వామపక్ష విద్యార్థిసంఘాలు ఖండించాయి. ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ అమెరికా అండతోనే పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసిందన్నారు. అమెరికాకు మోదీ మద్దతు ఉండటంతో బీజేపీ నాయకులు స్పందిస్తున్నారని ఆరోపించారు.ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మంద సురేశ్,సుధాకర్, మస్తాన్, లక్ష్మణ్, మడుపల్లి లక్ష్మణ్, శివనాయక్, మనోజ్, గోపి, యశ్వంత్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

## 102మంది రోగులకు వైద్య సేవలు

**షుగర్, బీపీలకు రూ.100లకే మందులు**

నేలకొండపల్లి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు, అమరజీవి నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని రావెళ్ళభవన్‌లో ఆదివారం నిర్వహించిన 32వ నెలనెలా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది.శిబిరానికి మొత్తం 102 మంది రోగులు హాజరయ్యారు. ఖమ్మం, శరత్ మాక్సివిజన్ వారిచే 26మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 76మందికి షుగర్, బీపీ, ఇతర రోగాలకు చికిత్స అందించారు. బీపీ, షుగర్ వ్యాధులకు నెలకు సరిపడా మందులను రూ.100లకే అందించారు. డాక్టర్ యలమద్ది వినూష, ఎండి, న్యూరో ఫిజీషియన్, డాక్టర్ గుడిపూడి రాజేష్, ఎంబీబీఎస్, డీఎన్‌బీ(చెవి,ముక్కు, గొంతువైద్యనిపుణులు), డాక్టర్ అడపా జయశ్రీ, ఎంఎస్ ఆప్తమాలజీలు శిబిరంలో వైద్య సేవలను అందించారు. వైద్యులకు గ్రామీణ వైద్యులు సహకరించారు. నేలకొండపల్లికి చెందిన మాటూరి సుబ్రమణ్యం రోగులకు అల్పాహారం అందచేసారు. కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, కొప్పుల వెంకట్రామిర్దె, గుడవర్తి నాగేశ్వరరావు, మంకెనపల్లి నర్సింహారావు, వల్లంచెట్ల భాస్కరరావు, ఏలూరి కోదండరామారావు, సామాల మల్లికార్జున్, అబ్దుల్ రహీం, డి.నాగేశ్వరరావు, అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

## బాధిత కుటుంబాలకు కందాళ పరామర్శ

తిరుమలాయపాలెం, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు మృతుల కుటుంబాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని సోలిపురంలో ఇటీవల మృతిచెందిన మందుల రాములు, ఇస్లావత్‌తండాలో మృతిచెందిన ఇస్లావత్ లాలి కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఇస్లావత్‌తండాలో ఏర్పాటు చేసిన శివయ్యకిరాణం షాపు ప్రారంభించారు. తెట్టెలపాడులో బీఆర్ఎస్ నాయకులు బిళ్లగిరి ధనుంజయ్ నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాతా రవీందర్, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, బోడ మంచానాయక్, బానోత్ రవి, దేవరం దేవేందర్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.



సోలిపురంలో రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కందాళ























## గడియారాల పంపిణీ



ముదిగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఎడవల్లి గ్రామంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోతో ఉన్న గడియారాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు కందిమళ్ల వీరబాబు, సామినేని వెంకటయ్య, రాంబాబు, నాగరాజు, సైదులు, బిచ్చాల బిక్షం, భాస్కర్ పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

బోనకల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుగులోతు పంతు నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని రావినూతల గ్రామంలో ఆదివారం ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవ వేడుకలను నిర్వహించి సంఘం పతాకావిష్కరణ చేశారు. గిరిజనులకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ పరికరాలను అందజేయాలని ఆయన కోరారు. గిరిజన సంఘ నాయకులు గుగులోతు నరేష్, కృష్ణ, గుగులోతు సైదులు, రాములు పాల్గొన్నారు.

## ట్రైసైకిళ్ల అందజేత



పెనుబల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ నిధి నుంచి దివ్యాంగులైన మాచినేని కృష్ణయ్య, కర్రి సత్యనికి ఆదివారం ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ట్రైసైకిల్‌ను అందజేశారు. మువ్వా అశోక్, వెంకటరెడ్డి, మువ్వా శ్రీను, నర్సింహారెడ్డి, శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## లారీ పల్టీ.. తప్పిన ప్రమాదం

కొణిజర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో లారీ అదుపుతప్పి పల్టీ కొట్టిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి..ఉత్తరప్రదేశ్ నుంచి రాజమండ్రికి మొక్కలతో వెళ్తున్న లారీ పల్లీపాడు సమీపంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# గ్రామాల్లో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

ఆదివారం శ్రావణమాస ముత్యాలమ్మ బోనాలను పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. జమలాపురం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మకు ప్రతీఏడు శ్రావణ మాసంలో నిర్వహించే వార్షిక గ్రామ బోనాలను ఆదివారం గ్రామస్థులు సామూహికంగా అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పు మేళాలతో ప్రదర్శనగా బయల్దేరగా ఊరేగింపులో యువతీయువకులు నృత్యాలు చేసి అలరించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం ఏర్పడింది. కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి రామానగర్ కాలనీలో ముత్యాలమ్మ జాతర వేడుకల్లో పాల్గొని బోనం ఎత్తి మహిళా భక్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామాల్లో పెద్దలు, మహిళలు, భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించారు.



కల్లూరులో బోనమెత్తిన ఏఎంసీ చైర్మన్ నీరజదేవి



వైరాలో ముత్యాలమ్మ ఊరేగింపు నిర్వహిస్తున్న ఐవీఎల్ డిపో హమాలీలు



కొణిజర్లలో బోనాల సందర్భంగా ద్వారానికి వేపాకు కడుతున్న భక్తులు



బేతుపల్లిలో బోనాలు సమర్పిస్తున్న భక్తులు



జమలాపురం ముత్యాలమ్మకు బోనాలు చెల్లిస్తున్న గ్రామస్థులు

## వేధిస్తున్న యూరియా కొరత

▸▸ అమలుకు నోచుకోని అధికారుల హామీ

తల్లాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత రైతులను వేధిస్తోంది. వరి సాగుకు అవసరమైన యూరియా కోసం రైతులు తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీ కార్యాలయం చుట్టూ రోజులు తరబడి ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్న దశలో గతనెల 26వతేదీన జిల్లా పోలీసుకమిషనర్ సునిల్ దత్, జిల్లా ప్రత్యేకాధికారి, మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణుమనోహర్ వంటి ఉన్నతాధికారులు సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి యూరియా కోసం క్యూలో ఉన్న రైతులకు అవసరానికి సరిపడా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని ఆందోళన చెందవద్దని హామి ఇచ్చారు. అధికారులు ఇచ్చిన హామీకి అనుగుణంగా యూరియా సరఫరా కాకపోవడంతో గంగదేవిపాడు సొసైటీ పరిధిలోని రైతులు యూరియాకోసం పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోనే అత్యధిక విస్తీర్ణంలో గంగదేవిపాడు సొసైటీ పరిధిలోని గ్రామాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం వరిపైరు ఎదిగే దశలో యూరియా వేయాల్సి ఉంది. సొసైటీ పరిధిలో ఉన్న రైతులకు సుమారు 40టన్నులు మేరకు యూరియా అవసరం ఉంది. యూరియా కోసం రైతులు ఐదారు రోజులుగా ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సొసైటీ కార్యాలయానికి వచ్చి యూరియా రాలేదని తెలిసి నిరాశతో వెనుదిరిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి తమ అవసరాలకు సరిపడా యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పెసర కోతలు ప్రారంభం

చింతకాని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగైదు రోజుల్లో అల్పపీడనం ఏర్పడి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు పంట కోతలకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో వానాకాలం మొదటి పంటగా రైతులు పెసర పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు పెసర సాగు చేపట్టారు. ఆదివారం పలు గ్రామాల్లో పెసర పంట కోతకు రావడంతో రైతులు పంట కోత యంత్రాలతో నూర్పిడి ప్రారంభించారు. ఒక్కో ఎకరాకు రూ 2 నుంచి 3 వేల వరకు యంత్రాలకు చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పెసర దిగుబడులు పెరగొచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గంగమ్మగుడి నిర్మాణానికి శంకుస్థాపన

కారేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగం బంజరలో ఆదివారం గంగమ్మతల్లి గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రేళ్ల సత్యానారాయణ ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వితరణగా అందజేశారు. పురోహితుడు ఈశ్వరశాస్త్రీ ఆధ్వర్యంలో తుమ్మలకుంట ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న గంగమ్మతల్లి గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గుడి చైర్మన్ పురం అంజయ్య, కమిటి సభ్యులు బడుగుల శ్రీనువాస్, పురం రామారాజు, బడుగులచిన్నిలింగయ్య, భాషాం కృష్ణ, భాషాం రామారావు, మొగిలిచర్ల రాంబాబు పాల్గొన్నారు.



గంగమ్మగుడి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యాదవులు

## ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి: పసుమర్తి



సమావేశంలో మాట్లాడుతున్న పసుమర్తి సీతాచందర్‌రావు

సత్తుపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అన్నికులాల వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ రాజకీయ అవకాశాలను ఆర్యవైశ్యులు అందిపుచ్చుకోవాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి సీతాచందర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక చెర్రీస్ రెస్టారెంట్‌లో నిర్వహించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ, నియోజకవర్గ స్థాయి రాజకీయ చైతన్య సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆర్యవైశ్య సమస్యలు స్థానిక ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన మంత్రుల సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. ఈ ఏడాది మార్చిలో విడుదలైన ఇంటర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించిన వెచ్చా వెంకటలక్ష్మి తేజస్వినిని శాలువాతో సత్కరించి గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికేట్‌ను బహూకరించారు. వనమా కిరణ్ కుమార్, పసుమర్తి రాంబాబు, గంగిశెట్టి జగదీష్‌కుమార్, చారుగుండ్ల వెంకట లక్ష్మీనరసింహారావు, వందనపు సత్యనారాయణ, గుండు ఉమామహేశ్వరరావు, సోమిశెట్టి శ్రీధర్, నడిపల్లి వాసుదేవరావు, అనుమోలు శ్రీనివాసరావు, పొలిశెట్టి శివకుమార్, వనమా వాసుతో పాటు నియోజకవర్గంలోని 5మండలాల ఆర్యవైశ్య బాధ్యులు పాల్గొన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పెనుబల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 2025 జూన్ ఐదులోపు భూభారతి పోర్టు ద్వారా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ అధికారి ప్రసాదరాజు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు రైతులు ఆధార్‌కార్డ్ ప్రకారం 18నుంచి 59సంవత్సరాల మధ్య వయస్సు ఉంటే ఏఈవోను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ఈనెల 13లోపులో భూమి పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, నామిని ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లను దరఖాస్తుకు జతచేసి ఏఈవోకు అందజేయాలన్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న రైతులు తమ వివరాలను సరిచూసుకుని ఏదైనా మార్పులు, చేర్పులు, ఏదైనా నామిని మార్పు ఉంటే ఈనెల 12లోపులో ఏఈవోను సంప్రదించాలని సూచించారు.

ఏన్కూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పాస్‌పుస్తకాలు పొంది అర్హత కలిగిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులు, భూభారతి పోర్టల్ ద్వారా కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 13వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5-6-2025 నాటికి 18నుండి 59 ఏళ్ల వయస్సుగల రైతులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డ్‌ను అనుసరించి వయస్సు నిర్ణయించబడుతుందని తెలిపారు. రెన్యువల్‌కు ఈనెల 12చివరి తేదీ అన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి: సీపీఎం

బోనకల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆదివారం స్థానిక బోస్ బొమ్మ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఎందుకు ఆమోదం తెలపడం లేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక రకమైన న్యాయం, మిగిలిన రాష్ట్రాల్లో భిన్నంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జొన్నలగడ్డ సునీత, పల్లా కొండలరావు, బందం శ్రీనివాసరావు, గుగులోతు నరేష్, దొండపాటి సత్యనారాయణ, కూచిపూడి మురళి పాల్గొన్నారు.